
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ၊ 20 ၊ జనవరి ၊ 2025



సోమశిలలో 69.515 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 69.515 టీఎంసీలు ఉన్నాయి. డెల్టాకు 2650 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 650, కండలేరుకు 200, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,900
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,435
3 శాతం జీఎస్టీతో	రూ.7,658
నవర (8 గ్రా)	రూ.61,264

గరిష్టం/కనిష్టం
29.3 /24.6

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. ఆదివారం గాలిలో తేమ 75 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘ సమావేశం జరిగింది. సంఘ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కె.రామప్రసాద్, జిల్లా యూనిట్ కార్యదర్శిగా కందుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రాజగోపాల్‌బాబు, జిల్లా యూనిట్ ఉపాధ్యక్షుడిగా డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు వి. చెంచురామయ్య, కోశాధికారిగా డీకేడబ్ల్యూ కళాశాల అధ్యాపకుడు టి.రంజని, జాయింట్ సెక్రటరీగా విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రవిచంద్రారెడ్డిలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు శ్రీరమణమూర్తి వ్యవహరించారు. సభ్యులు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బొందిలి సంఘీయులను ఓబీసీలో చేర్చాలి

- సంఘ రాష్ట్ర నేతల డిమాండ్



మాట్లాడుతున్న తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు జైసింగ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో బొందిలి కులాన్ని బీసీ–బీగా చేర్చారని, కానీ కేంద్రంలో ఓపెన్ కేటగిరీలో ఉంచడం అన్యాయమని బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.కృష్ణసింగ్, తమిళనాడు బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జైసింగ్, బొందిలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌సింగ్ తెలిపారు. నగరంలో కేవీఆర్ పెట్రోలు బంక్ దగ్గర ఉన్న ఏఎల్‌రావు కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత రాజపుత్ర యోధుడు మహారాణా ప్రతాప్‌సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. రాష్ట్ర నేతలు మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో బొందిలి కులస్తులను బీసీ–బీ కేటగిరీలో చేర్చారన్నారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది వరకు బొందిలి సంఘీయులు ఉన్నారన్నారు. గతం రాష్ట్ర ప్రభుత్వం బొందిలి సంఘీయుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. బొందిలి సంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు ఐక్యతగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

బొందిలి సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నెల్లూరు కృష్ణసింగ్ (నెల్లూరు), ఎం.మోహన్‌సింగ్ (తిరుపతి), గౌరవ అధ్యక్షులుగా కె.శంకర్‌సింగ్ (గుంటూరు), లలితాబాయి (వైఎస్సార్), కోశాధికారిగా జి.సునీతాబాయి, ఉపాధ్యక్షుడిగా బి. సత్యంబాబుసింగ్, కమిటీ సభ్యులుగా ధర్మనారాయణ్‌సింగ్, పి.శ్రీనివాస్‌సింగ్, మహేష్‌సింగ్ తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా బొందిలి సంఘం కమిటీలో అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాస్‌సింగ్, కార్యదర్శిగా ఎ.నాగేంద్రసింగ్, కోశాధికారిగా చంద్రబాన్‌సింగ్, గౌరవ అధ్యక్షుడిగా ఆర్.కోటిసింగ్, ఉపాధ్యక్షులుగా వై.సాయిప్రసాద్ సింగ్, వై.శివవాసుదేవ్‌సింగ్, ఆర్.నవీన్‌కుమార్‌సింగ్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కె.సురేష్‌సింగ్, ఎన్.మల్లికార్జున్‌సింగ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.చంద్రపాల్‌సింగ్, న్యాయసలహాదారుగా ఆర్.బాలేంద్రసింగ్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వాహకులుగా తరుణ్‌సింగ్ వ్యవహరించారు.

అయ్యో... ఆలివ్‌రిడ్లీ

- గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తూ మృతి



తాటిచెట్లపాలెం తీరంలో ఆలివ్‌రిడ్లీ కళేబరాలు

బిట్రగుంట: బోగోలు మండలం తాటిచెట్లపాలెం సమీపంలో తీరంలో భారీగా ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్నాయి. సంతానోత్పత్తి కోసం వేల కి.మీ. ప్రయాణించి తీరానికి వస్తున్న తాబేళ్లు మధ్యలో గాయపడి మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ప్రతిరోజూ పదుల సంఖ్యలో తాబేళ్లు చనిపోయి కనిపిస్తున్నాయి. థాయిలాండ్, మలేసియా, ఇండోనేషియా తీరాల్లో ఎక్కువగా సంచరించే అరుదైన ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు సంతానోత్పత్తి కోసం నవంబర్–మార్చి మధ్యలో సుమారు 20 వేల కి.మీ. ప్రయాణించి ఒడిశా, ఏపీలోని తీర ప్రాంతాలకు చేరుకుంటాయి. రాష్ట్రంలోని తీర ప్రాంతాలకు ఎక్కువగా జనవరిలోనే వీటి రాక అధికంగా ఉంటుంది. తీరంలో గుడ్లు పెట్టి అవి పిల్లలుగా మారిన తర్వాత తిరిగి వెళుతుంటాయి. వేల కి.మీ. ప్రయాణించి తీరానికి వచ్చే క్రమంలో పడవలు, వలల కారణంగా గాయాలపాలవుతున్న తాబేళ్లు తీరానికి చేరిన తర్వాత మృత్యువాత పడుతున్నాయి. సముద్ర జలాల్లో కాలుష్యం కారణంగా జబ్బు పడుతున్న తాబేళ్లు కూడా తీరానికి వచ్చి చనిపోతున్నాయి.

రోడ్లకు చంద్ర గ్రహణం

గ్రామీణ రహదారులు ప్రగతికి చిహ్నాలు. గత ప్రభుత్వంలో ప్రారంభమై శరవేగంగా జరుగుతున్న పనులను కూటమి ప్రభుత్వం ఒక్క కలం పోటుతో నిలిపివేసింది. కూటమి పాలకులు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా జిల్లాలో రహదారులు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. అక్కడక్కడా ప్యాచ్ వర్క్‌లతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోంది. కొత్తగా రహదారుల అభివృద్ధి, నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం ఒక్క ప్రతిపాదనలు లేకపోగా, జరుగుతున్న పనులను నిలిపివేసి కాంట్రాక్టర్ల పాలిట శాపంగా దాపురించింది.



గత ప్రభుత్వంలో ప్రారంభమైన పనులపై ఆంక్షలు

- 25 శాతం లోపు జరిగిన పనులను రద్దు చేస్తూ ఆదేశాలు
- ఆగిపోయిన సీఆర్‌ఐఎఫ్, ఎండీఆర్, రాష్ట్ర హైవే పనులు
- జిల్లాలో రూ.200 కోట్ల మేర పనుల రద్దు
- లింకు రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణం ఆగిపోవడంతో నరకయాతన ప్రయాణం
- చేసిన పనులకు బిల్లులు రాక నష్టపోయిన కాంట్రాక్టర్లు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ప్రధాన రహదారుల అభివృద్ధికి చంద్ర గ్రహణం పట్టింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన మరుసటి రోజు నుంచి రహదారులు అభివృద్ధి చేయలేదంటూ నిత్యం అసత్యాలు ప్రచారం చేసిన కూటమి నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. ఇప్పటికే అనేక రహదారుల నిర్మాణం పూర్తికాగా, కొన్ని రోడ్ల నిర్మాణాలు 50 శాతం నుంచి 80 శాతం వరకు పనులు జరిగాయి. ఎన్నికలకు మూడు నెలలు ముందు ప్రారంభించిన పనులు అయితే 25 శాతానికి పైగానే జరిగాయి.

లింక్ రోడ్ల పనులకు గత ప్రభుత్వం ప్రాధాన్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రధానంగా జిల్లాలో లింక్ రోడ్ల నిర్మాణాలతోపాటు పునర్నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారులను విస్తరించడంతోపాటు పునర్నిర్మాణాలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో సుమారు రూ.400 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. పలుచోట్ల పనులు జరుగుతుండగా అంతలోనే ప్రభుత్వం మారింది. అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వంలో రోడ్లకు చంద్రగ్రహణం పట్టించింది. రోడ్లు పూర్తయితే మంజూరు చేసిన నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని భావించిన ప్రస్తుతం సీఎం 25 శాతంలోపు జరిగిన పనులతోపాటు పనులు మొదలు కాని వాటిని రాష్ట్ర వ్యాప్తంగా రద్దు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా సుమారు రూ.200 కోట్లకు పైగా నిధులతో జరుగుతున్న పనులన్ని అర్ధాంతరంగా నిలిచిపోయింది.

2023లోనే ప్రతిపాదనలు

ఎన్‌డీబీ ప్రాజెక్ట్ కింద మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లైన్ రోడ్లతో అనుసంధించాలని రూ.422 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదించిన 15 పనులు ఆమోదించింది. అందులో భాగంగా కావలి పట్టణంలోని పాత బైపాస్ (చెన్నై–కోల్‌కతా) రహదారికి రూ 55 కోట్లు, సీఆర్‌ఐఎఫ్ పనుల కింద 4 పనులు రూ.115 కోట్లతో మంజూరయ్యాయి. వీటికి టెండర్లు పిలిచారు. 2024 నాటికి కొన్ని చోట్ల పనులు జరిగాయి. మరి కొన్ని చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. ఇంకొన్ని చోట్ల ప్రారంభం కావాల్సి ఉండగా అంతలోనే సాధారణ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మిగతా పనులు ప్రారంభించడానికి వీలు లేకుండా పోయింది.

అధికారం మారడంతో పనులకు మోకాలడ్డు..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే అప్పటికే పలుచోట్ల జరుగుతున్న రోడ్ల నిర్మాణాలను నిలిపివేశారు. మరికొన్ని చోట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేలు పాత కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు డిమాండ్ చేసి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాళ్లు అడిగింది ఇచ్చుకుని పనులు ప్రారంభించినప్పటికీ.. కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా ఆపేసింది. కూటమి ప్రభుత్వంలో పార్టీ నేతల పరిస్థితిని చూసి చాలా రహదారుల నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లు పనుల వేగాన్ని తగ్గించారు.

సంక్రాంతి కానుకగా రూ.200 కోట్ల పనుల నిలిపివేత

గత ప్రభుత్వంలో మంజూరై జరుగుతున్న పనులను పూర్తి చేస్తే ఆ ప్రభుత్వానికే క్రెడిట్ దక్కుతుందని భావించిన కూటమి ఎమ్మెల్యేలు ఆయా పనులను తమ వాళ్లకు అప్పగించి కమీషన్లు దండుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగా 25 శాతం కూడా పనులు పూర్తి చేయలేదంటూ, కొన్ని చోట్ల పనులు ప్రారంభించలేదంటూ నిర్మాణంలో సుమారు రూ. 200 కోట్ల పనులను సైతం అర్ధాంతరంగా రద్దు చేసింది. జిల్లా ప్రజలకు సంక్రాంతి కానుకగా ఈ నెల 13న జిల్లాలో రోడ్లు పనులను రద్దు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఆర్‌అండ్‌బీ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు ఆగిపోవడంతో పూర్తికాని రోడ్లపై రాకపోకలు సాగించలేక ప్రజలు నరక ప్రయాణం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై మండి పడుతున్నారు.

నిలిచిన ఎండీఆర్, స్టేట్ హైవే పనులు

మేజర్ డిస్ట్రిక్ట్స్ రోడ్లు, స్టేట్ హైవే పనులు పలుచోట్ల జరుగుతుండగా వాటిని కూడా ప్రభుత్వం ఆపేసింది. సర్వేపల్లి నియోజకవర్గంలోని తిరుమలమ్మపాళెం 8.8 కి.మీ రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఆ పనులు టెండర్ దశలోనే ఉన్నాయి. అంతలోనే ఈ పనులు కూడా ఆపేశారు. కొలనుకుదురు నుంచి 9.75 కి.మీ పరిధిలో రోడ్డు నిర్మాణానికి రూ .4 కోట్లు మంజూరయ్యాయి. కావలి పట్టణంలో 0/0 కి.మీ. నుంచి 8/0 కి.మీ వరకు నిర్మించాల్సిన రూ.41.82 కోట్లతో అగ్రిమెంట్ జరిగిన రోడ్డు పనులు కూడా ఆపేశారు. నెల్లూరు నుంచి కృష్ణపట్నం రోడ్డులో పొట్టెంపాడు వద్ద నక్కల వాగు మీద బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశారు. తొలి దశ టెండర్లలో కాంట్రాక్టర్లు ఎవరూ పాల్గొనలేదని, రెండో దఫా టెండర్లు పిలిచారు. అయితే ఈ పనిని కూడా ప్రభుత్వం ఆపేసింది. ఇలా రూ.200 కోట్లకు పైగా జరగాల్సిన అన్ని రకాల అభివృద్ధి పనులు ఒక్క కలంపోటుతో ఆగిపోయాయి.

ఆగిన అభివృద్ధి పనులు

- నెల్లూరు నుంచి మైపాడు రోడ్డుకు రూ.48 కోట్లు మంజూరయ్యాయి. మొదటి దశ పనులు పూర్తయ్యాయి. రెండో దశ పనులు ప్రారంభం కాగా, అయితే అసలు పనులే ప్రారంభం కాలేదంటూ ఆ పనిని ఆపేశారు. పనులు పూర్తి చేయడానికి అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ సమయమివ్వకుండా పనులు రద్దు చేస్తూ ఉత్తర్వులు రావడం గమనార్హం.
- గూడూరు నుంచి తురిమెర్ల రోడ్డుకు రూ.30 కోట్లు మంజూరై సుమారు 15 శాతం పనులు పూర్తయ్యాయి. 25 శాతం కూడా పనులు జరగలేదంటూ ఆపేశారు.
- నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు రోడ్డు విస్తరించడంతోపాటు అభివృద్ధి చేయడం కోసం రూ.45 కోట్లు మంజూరయ్యాయి. ఆ పనులు జరుగుతూనే ఉన్నాయి. 25 శాతం పూర్తి కాలేదంటూ ప్రభుత్వం ఆపేసింది.



మాకు ఇంకా ఆదేశాలు అందలేదు



జిల్లాలో ఆర్‌అండ్‌బీ పనులు ఆపేసినట్లు ఆదేశాలు ఇంకా ఈఏసీ నుంచి మా కార్యాలయానికి అందలేదు. ఉత్తర్వులు చేతికందితేనే పూర్తి వివరాలు తెలుస్తాయి. అప్పటి వరకు ఏమి చెప్పలేను. ప్రస్తుతం పనులు అయితే మందకొడిగానే జరుగుతున్న మాట వాస్తవమే.

– ఎం.గంగాధరం, ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, నెల్లూరు సర్కిల్

యోగి వేమన సాక్షాత్ భగవత్స్వరూపమే



యోగి వేమన భగవాన్ ప్రతిమతో నగరోత్సవం

- ఘనంగా యోగి వేమన భగవాన్ జయంతి

నెల్లూరు(బృందావనం): యోగి వేమన సాక్షాత్ భగవత్స్వరూపమే అని త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి అన్నారు. జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో యోగివేమన జయంతిని ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అనిల్‌గార్డెన్స్‌లో ప్రత్యేక వేదిక నిర్మించి యోగి వేమన భగవాన్ ప్రతిమను కొలువుదీర్చి పూజలు చేశారు. అనిల్‌గార్డెన్స్ నుంచి మద్రాస్ బస్టాండ్ కేవీఆర్ పెట్రోలు బంక్ మీదుగా తిరిగి అనిల్‌గార్డెన్స్ వరకు యోగి వేమన భగవాన్ ప్రతిమతో నగరోత్సవాని నిర్వహించారు. రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీరెడ్డి వేమన భగవాన్ ప్రతిమకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవా సమితి నెల్లూరు సభ్యులు పెంచల నరసయ్య, ఎంసీ.సుధాకర్ ఆచారి, రత్నమాచారి, జి.ప్రసాద్, జి.నరసింహప్రసాద్, శేషా రత్నమ్మ, శ్రీజ, డీవీ ప్రసాద్, శేఖర్, రమాదేవి పాల్గొన్నారు.

భోక్తలకు భరోసా!

ఉపాధి అవినీతి పరులపై చర్యలకు జాప్యం



కలెక్టర్ నివేదికలు..
కమిషనర్ ఆదేశాలు బుట్టదాఖలు

ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతికి పాల్పడిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యం చూస్తుంటే.. వారిని కాపాడే ప్రయత్నంలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమాలు తేల్చి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను జిల్లా ఉన్నతాధికారులు తొక్కి పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి పాత్ర ఉందని తేలిన సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు.. కానీ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వెనుక భారీగానే నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది.

- కొడవలూరు, రాపూరు సిబ్బందిపై సస్పెన్షన్ వేటుతో సరి
- అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కమిషనర్ ఆదేశాలు
- రెండు నెలలు కావస్తున్నా.. అతీగతి లేదు

నెల్లూరు (పొగతోట): కొడవలూరు మండలం తలమంచిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో రూ.28 లక్షలు అవినీతి జరిగింది. ముగ్గురు ఎంపీడీఓలు, ఉపాధి హామీ సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తేల్చారు. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసి రెండు నెలలు గడుస్తోంది. అయితే సిబ్బందిని సస్పెండ్ చేశారు. కానీ క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు. ముగ్గురు ఎంపీడీఓలకు కనీసం షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు కూడా లేదని ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉద్దేశ పూర్వకంగానే ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాపూరు మండలంలో రూ.60 లక్షలకు పైగా అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్ టీమ్ నిర్ధారించింది. ఇందుకు బాధ్యులైన సిబ్బందిపైన కూడా కనీసం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సేఫ్ జోన్‌గా పక్క మండలాలకు బదిలీలు చేసి ఊరుకున్నారు. రూ.లక్షల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన సిబ్బంది సంతోషంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో కొలతల్లో తేడాలు, మస్టర్లలో అక్రమాలు ఉన్నట్లు నిర్ధారించారు. ముగ్గురు ఎంపీడీఓలు, ఉపాధి హామీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జెడ్పీ సీఈఓను ఆదేశించారు. ఎంపీడీఓలపై చర్యలు తీసుకునే స్థాయి జెడ్పీ సీఈఓకు లేకపోవడంతో పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదికలు పంపించాల్సి ఉంది. నివేదికలు పంపించడంలో జాప్యం జరుగుతోంది. అధికార పార్టీ నాయకుల సిఫారసు, ఒత్తిళ్లతో ఎంపీడీఓలపై చర్యలకు జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. కలువాయి మండలం ఉపాధి హామీ పనుల్లో రూ.26 లక్షలు అవినీతికి పాల్పడిన సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అంతకు మించి రాపూరు, సైదాపురంతో పాటు ఇతర మండలాల్లో రూ.50 లక్షలకు మించి పైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో నిర్ధారించారు. అయితే ఆయా మండలాల సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తే.. అవినీతి భోక్తలకు అధికారులు భరోసా కల్పిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

కమిషనర్‌కు నివేదికలు పంపించాం

కొడవలూరు మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో ఎంపీడీఓలు అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్‌కు నివేదికలు అందించారు. కలెక్టర్ ఎంపీడీఓలపై చర్యలు తీసుకోమని ఆదేశాలు ఇచ్చారు. ఎంపీడీఓలపై చర్యలు తీసుకునే అధికారం జెడ్పీ సీఈఓలకు లేదు. ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేశాం. అక్కడి నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

– విద్యారమ, జెడ్పీ సీఈఓ

ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు..



కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులురెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

- పది రెట్లు క్షోభ పడే రోజులు వస్తాయి.. సిద్ధంగా ఉండండి
- కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరిక

కావలి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులపై కర్కశంగా ప్రవర్తిస్తూ క్షోభకు గురి చేస్తున్న టీడీపీ నాయకులు, వారిని ప్రోత్సహిస్తున్న శక్తులతోపాటు కొందరు పోలీసులు అధికారులను సైతం ఎవరినీ వదిలే ప్రసక్తేలేదని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. పది రెట్లు క్షోభ పడే రోజులు వస్తాయని, అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కావలి నియోజకవర్గంలోని బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీ కోళ్లదిన్నెలో టీడీపీ నాయకులు దాడిలో తీవ్రంగా గాయపడి కావలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత పల్లెబోయిన శ్రీనివాసులురెడ్డిని ఆదివారం కావలి మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. అనంతరం మీడియాతో కాకాణి మాట్లాడారు. పోలీసులను అడ్డుపెట్టుకుని మనుగడ సాగించాలని భావించడం పొరపాటన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను బాధ పెట్టిన వారు సప్త సముద్రాల అవతల ఉన్నా, వారిని శిక్షించడం ఖాయమని హెచ్చరించారు. టీడీపీ నాయకుల మెప్పు కోసం పోలీసులు చేస్తున్న పాపాలు భవిష్యత్‌లో వారికి శాపాలు మారుతాయన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎవరూ మిమ్మల్ని కాపాడలేడన్నారు. ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడితే అప్పుడు మీకు, మీ కుటుంబాలకు తెలుస్తాయన్నారు.

బతుకుదెరువుపై దెబ్బ కొడతారా?

అధికారం శాశ్వతం కాదు.. టీడీపీ నాయకులు దాడులు చేయడం, పోలీసుల చేత కొట్టించడం, ఆస్తులు లాక్కోవడం, వ్యాపారాలను దెబ్బకొట్టడం, వృత్తులను ధ్వంసం చేయడం... ఇలా అనేక విధాలుగా దమనకాండ సాగిస్తున్నారని, పోలీసుల అండ లేకుండా టీడీపీ నాయకులు ధైర్యంగా గ్రామాల్లో స్వేచ్ఛగా తిరగగలరా?, మనుగడ సాగించగలరా? అని కాకాణి సవాల్ చేశారు. పోలీసులు, అధికారులు టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు దిగజారి వ్యవహరిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మీ ఊహలకే వదిలేస్తున్నామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి గాలికి..

టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగం, కక్ష సాధింపుల పాలన సాగిస్తున్నారని కాకాణి మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై విచ్చలవిడి దాడులకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఈ దాడులు నిత్యకృత్యంగా మారాయన్నారు. టీడీపీ నేతల దాడిలో శ్రీనివాసులురెడ్డి గాయపడి చికిత్స కోసం కావలిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వస్తే, ఆస్పత్రి ప్రాంగణంలో కూడా ఆయనపై మళ్లీ దాడి చేయడం దారుణమన్నారు. శ్రీనివాసులురెడ్డి దంపతులు చెబుతున్న విషయాలు వింటుంటే కన్నీళ్లు వస్తున్నాయన్నారు. ఈ ఘటనలో బాధితులు 8 మందిపై కేసులు బనాయించారన్నారు. దాడి చేసిన వారిని రాచమర్యాదలతో వదిలేశారని, బాధితులను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి ఇబ్బందికి గురిచేశారని చెప్పారు. బాధితుల ఫిర్యాదుపై పోలీసులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పోలీసులపై ప్రైవేట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఆయుర్వేదంతో సైనస్, చర్మ సమస్యలకు చెక్



మాట్లాడుతున్న ఆనందయ్య

నెల్లూరు(అర్బన్): సైనస్‌తో బాధపడుతున్న వారికి, బొల్లి, మంగు లాంటి చర్మ వ్యాధులకు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యంతో చెక్ పెట్టొచ్చని వైద్యుడు ఆనందరావు తెలిపారు. నెల్లూరు హరనాథపురం ఐదో వీధిలోని ప్రకృతి ఆయుర్వేద నిలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వనమూలికలను సేకరించి శుద్ధి చేసి వాటి ద్వారా మందులు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. తమ ఇంటితోపాటు వైద్యశాలలో కూడా ఎన్నో రకాల ఔషధ మొక్కలను పెంచుతూ కొన్ని రకాల జబ్బులకు రోగుల ఎదురుగానే మొక్కల నుంచి తీసిన ద్రావకాలను అందజేస్తూ జబ్బులను నయం చేస్తున్నట్లు తెలిపారు. మధుమేహం, కీళ్లనొప్పులు, బలహీనత, స్త్రీల సమస్యలు, దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలను ఆయుర్వేదంతో నయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 40 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. సేవలకు టీడీయూ యూనివర్సిటీ వారు 2022లో వైద్యరత్న అవార్డుతో సత్కరించారని వెల్లడించారు. అతి తక్కువ ఖర్చుతో సైడ్ ఎఫెక్ట్‌లు లేని ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌లో యోగి వేమన జయంతి



నివాళులర్పించిన అధికారులు

నెల్లూరు రూరల్: నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఆదివారం యోగి వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి డీఆర్వో జె.ఉదయ భాస్కర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు నిహారిక, సాయిభార్గవి, శంకర్ వేమన పద్యాలను ఆలపించారు. డీఆర్వో మాట్లాడుతూ సత్యం, ధర్మం, సమానత్వం, మానవతా విలువలపై ప్రత్యేక దృష్టి పెట్టి సామాజిక సమస్యలను తన పద్యాల ద్వారా ఎలుగెత్తి చాటిన ప్రజాకవి వేమన అని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఏసీఏ అండర్-12 టోర్నీ

- విజేత విశాఖ, రన్నరప్‌గా నెల్లూరు



నెల్లూరు జట్టు

విశాఖ స్పోర్ట్స్: ఏసీఏ అంతర్ జిల్లాల బాలుర అండర్-12 క్రికెట్ విజేతగా విశాఖ జట్టు, రన్నరప్‌గా నెల్లూరు జట్టు నిలిచాయి. వైఎస్ఆర్ స్టేడియం బీ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు కెప్టెన్ మానేష్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. విశాఖ జట్టు బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ యాశిల్ విగ్నేష్ 49 పరుగులు చేశాడు. ఆ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో ఏడు వికెట్లకు 186 పరుగులు చేసింది. తన్విక్‌రెడ్డి రెండు వికెట్లు తీశాడు. నెల్లూరు జట్టు 9 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసింది. రోహిత్ మూడు వికెట్లు తీయగా షణ్ముఖ, పవన్ రెండేసి వికెట్లు తీశారు. దీంతో విశాఖ 68 పరుగులతో టైటిల్ పోరులో విజయం సాధించింది. విజేతలకు ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకటరామ్‌ప్రశాంత్ ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీఏ గేమ్ డెవలప్‌మెంట్ జీఎం ఎంఎస్ కుమార్, ఏజీఎం శివకుమార్, వైఎస్ఆర్ స్టేడియం ఇన్‌చార్జి జేకేఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 15 గొర్రెల మృతి

- రూ.3 లక్షల వరకు నష్టం



కోవూరు: రోడ్డు ప్రమాదంలో 15 గొర్రెలు మృతి చెందిన ఘటన పోతిరెడ్డిపాళెం పరిధిలోని గంగవరం కాలువ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు.. పోతిరెడ్డిపాళెం తిప్ప గిరిజనకాలనీకి చెందిన ఉప్పల శ్రీహరి తన గొర్రెల్ని మేపి ఇంటికి తోలుకెళ్తున్నాడు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి బుచ్చి వైపు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ ట్యాంకర్ గొర్రెలు మందను వేగంగా ఢీకొంది. దీంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఐదు గొర్రెలు స్వల్పంగా గాయపడ్డాయి. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్ వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కుష్టు వ్యాధిపై నేటి నుంచి ఇంటింటి సర్వే

- 1,875 బృందాలతో పరిశీలన
- ముందస్తు చికిత్సతో అంగవైకల్యం దూరం
- అవగాహనతోనే వ్యాధికి చెక్

చిన్నచూపు వద్దు.. వ్యాధిని తరిమేద్దాం

కుష్టు వ్యాధి.. ఇది సోకితే అంగవైకల్యం రావొచ్చు. రోగులను తక్కువ చేసి చూడకుండా అసలు వ్యాధినే తరిమేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి వైద్యశాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం నుంచి కాపాడొచ్చు. అంతేకాకుండా వ్యాధిని దూరం చేసి అందరితోపాటు సంతోషంగా జీవించేలా చేయొచ్చు.





నెల్లూరు(అర్బన్): వైద్యశాఖ ఎన్ని చర్యలు తీసుకున్నా కుష్టు వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. జిల్లాలో కొన్నేళ్లుగా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయినా అక్కడక్కడా కొత్తవి నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సంవత్సర కాలంలో 117 మంది ఈ వ్యాధిన బారినపడ్డారు. ప్రస్తుతం వీరికి చికిత్స చేస్తున్నారు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తిని కొందరు చిన్నచూపు చూస్తారు. ఇది ఒకరి నుంచి ఒకరికి సోకే ప్రమాదం లేదు.

మూడు కాలనీలు

జిల్లాలో అధికారికంగా 1,032 మంది కుష్టు వ్యాధి వల్ల ఏళ్ల తరబడి అంగవైకల్యంతో బాధపడుతున్నారు. వీరి కోసం నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామం వద్ద రెండు కాలనీలు, రాపూరు సమీపంలోని మరో గ్రామం వద్ద నజరత్ కాలనీలు ఏర్పాటు చేశారు. మరో 300 మంది చికిత్స ద్వారా కోలుకుని చిన్న చిన్న లోపాలతో జీవిస్తున్నారు. కాలనీల్లో నివాసం ఉంటున్న వారికి జిల్లా వైద్యారోగ్య శాఖ సంవత్సరానికి రెండుసార్లు ఎంసీఆర్ చెప్పులు అందజేస్తోంది. సబ్బులు, టవల్స్ ఇస్తోంది. గాయాలు పెరగకుండా గట్టి పడిన చర్మం మెత్తపడేందుకు కాళ్లు, చేతులకు రాసుకునేందుకు ఆలివ్, వేప నూనెను పంపిణీ చేస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, దాతలు సాయం చేస్తున్నారు.

అవగాహన పెంచుకుని..

కుష్టు అంటు వ్యాధి కాదు. అయితే ఆ వ్యాధి ఉన్న వారితో ఏళ్ల తరబడి కలిసి ఉంటేముక్కు, నోటి ద్వారా తుంపర్ల రూపంలో బాక్టీరియా వ్యాపించవచ్చు. ఇతరుల చర్మంపై కోతలు, గాయాలుంటే అంటుకునే ప్రమాదం ఉంది. ఒకసారి బాక్టీరియా సోకితే దాని లక్షణాలు 2 నుంచి 20 సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా బయటపడొచ్చు. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కుష్టు రాకుండా ఉండటానికి ఎలాంటి టీకాల్లేవు. అయితే క్షయకు వాడే బీసీజీ టీకా కొంతమేరకు కుష్టు కొత్తవారిలో రాకుండా ఉండేందుకు సాయపడుతుందని నూతన అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అందువల్ల ప్రజలు తమ శరీరంపై ఎలాంటి మచ్చలుంటే సకాలంలో డాక్టర్‌కు చూపించుకుని మందులు వాడితే కుష్టు రాకుండా అరికట్టవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఉంటే ఈ వ్యాధి కారక జీవులు వ్యాపించవని చెబుతున్నారు.

నేటి నుంచి..

సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జిల్లాలో లెప్రసీ (కుష్టు) సర్వే జరుగుతుంది. ఇందుకోసం జిల్లా వైద్యశాఖ 1,875 బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో దాంట్లో ఒక ఆశావర్కర్, మరో పురుష వలంటీర్ ఉంటారు. వీరికి ఏఎన్ఎంలు సహకారం అందిస్తారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకుంటున్నారు. కుష్టుకు సంబంధించిన మచ్చలతోపాటు తామర, బొల్లి లాంటి అన్ని రకాల మచ్చలున్నాయా అని ఆరాతీస్తారు. మచ్చలున్న వారిని సమీపంలో పీహెచ్‌సీకి తీసుకెళ్లి అక్కడి డాక్టర్లతో మళ్లీ పరీక్ష చేయిస్తారు. కుష్టు మచ్చలుగా అనుమానిస్తే పరీక్షలు చేసి నిర్ధారణ చేస్తారు. సాధారణమైతే వాటికి కూడా మందులు ఇస్తారు.

జిల్లాలో..

అంగవైకల్యంతో బాధపడుతున్న వారు : **1,032** మంది

కొత్తగా చికిత్స పొందుతున్న వారు : **117** మంది

ప్రజలు సహకరించాలి



కుష్టు వ్యాధి లేని ఉన్నతమైన సమాజం కోసం చేస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలి. వైద్యశాఖ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు శరీరంపై ఎలాంటి మచ్చలున్నా తెలియజేయాలి. కుష్టు వ్యాధి మచ్చలుగా అనుమానిస్తే పరీక్షలు చేయించి నిర్ధారణ అయితే వారి వివరాలు అత్యంగా గోప్యంగా ఉంచి చికిత్స అందిస్తాం. ముందస్తు చికిత్స చేసినందు వల్ల వ్యాధి నయమవుతుంది. భవిష్యత్‌లో అంగవైకల్యం రాకుండా కాపాడొచ్చు.

– డాక్టర్ ఖాదర్‌వలీ, అడిషనల్ డీఎంహెచ్ఓ, కుష్టు నివారణ అధికారి

బంగారు కడ్డీలతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారు కడ్డీలతో తయారీదారుడు ఉడాయించిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు తిప్పరాజువారి వీధికి చెందిన పవన్‌కుమార్ జైన్ పెద్ద పోస్టాఫీస్ మాధవపాటి వీధిలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడి వద్ద కొత్తూరు టైలర్స్ కాలనీకి చెందిన మహ్మద్ ఇంతియాజ్ అనే వ్యక్తి బంగారు కడ్డీలు తీసుకుని కమీషన్ పద్ధతిపై ఆభరణాలు తయారు చేసి ఇచ్చేవాడు. చెప్పిన సమయానికి ఆభరణాలు ఇస్తూ ఎంతో నమ్మకంగా ఉండేవాడు. గతేడాది డిసెంబర్ 21, ఈనెల 2వ తేదీన పవన్ బంగారు ఆభరణాల తయారీ నిమిత్తం 550 గ్రాముల బంగారు కడ్డీలను ఇంతియాజ్‌కు ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా అతను ఆభరణాలు తయారు చేసి ఇవ్వలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కొరడా వీధిలోని ఇంతియాజ్ దుకాణం వద్దకు వెళ్లగా అది మూసి ఉంది. దీంతో బాధితుడు ఇంతియాజ్ ఇంటికి వెళ్లి ఆరాతీయగా కొద్దిరోజులుగా ఆయన ఇంటికి రావడం లేదని తెలిసింది. దీంతో పథకం ప్రకారమే అతను బంగారంతో ఉడాయించాడని, చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 55.688 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 55.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 950, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కోలాహలంగా 'ఫ్లెమింగో ఫెస్టివల్'

సూళ్లూరుపేట: ఫ్లెమింగో ఫెస్టివల్ – 2025కు రెండోరోజు ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన సందర్శకులు, స్కూల్ విద్యార్థులు తరలిరావడంతో ఇటు సూళ్లూరుపేట, అటు నేలపట్టు పక్షుల కేంద్రం, భీములవారిపాళెం పడవల రేవు, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రాలు సందడిగా మారాయి. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్ స్టాల్స్, రంగులరాట్నాలు ఏర్పాటు చేయడంతో సందర్శకులు తాకిడి ఎక్కువగా కనిపించింది. అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పర్యాటకులు పక్షులకు సంబంధించి ఫిల్మ్‌షో వీక్షించారు. అలాగే మ్యూజియంను చూసేందుకు బారులు తీరారు. నేలపట్టులో పక్షులను వీక్షించేందుకు, భీములవారిపాళెం పడవల రేవులో బోట్ షికారు చేసేందుకు అధికంగా ఆసక్తి చూపించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. శ్రీహరికోట- సూళ్లూరుపేట మార్గంలో ఇరువైపులా పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలు, పెయింటెడ్ స్టార్క్స్ ప్రకృతి ప్రియులకు కనులవిందు చేశాయి. సరస్సులో నీరు తక్కువగా ఉండటంతో పక్షులు రోడ్డుకు పక్కనే గుంపులు గుంపులుగా దర్శనమివ్వడంతో పర్యాటకులు ఆశ్చర్యానందానికి గురయ్యారు. నేలపట్టు పక్షులు కేంద్రంలో గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, తెల్ల కంకణాయిలు, తెడ్డుముక్కుకొంగలు, పలు రకాల బాతు జాతి పక్షుల సందడి ఆకట్టుకుంటోంది.

- సూళ్లూరుపేటకు వచ్చిన పర్యాటకులు నేలపట్టు, అటకానితిప్పకు, భీములవారిపాళెం పడవల రేవు, శ్రీసిటీ పారిశ్రామికవాడకు వెళ్లేందుకు ఉచితంగా బస్సులు నడిపారు. ఇందుకోసం స్థానిక స్కూళ్లు, కళాశాలలకు చెందిన ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఖర్చులు కూడా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలే భరించినట్లు తెలిసింది.
- ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చిన పర్యాటకులు షార్ సందర్శనకు అవకాశం లేకుండా పోయింది. ఈనెల 29న జీఎస్ఎల్‌వీ ఎఫ్15 ప్రయోగించనున్న నేపథ్యంలో భద్రతా కారణాల వల్ల షార్ అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో పర్యాటకులు బయట నుంచే షార్ కేంద్రం ఫొటోలు తీసుకుని వెళుతున్నారు.



స్టాల్‌ను సందర్శిస్తున్న పర్యాటకులు

బోట్ షికారు





కిక్కిరిసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం

సంరక్షణ మరచి.. కూలీలుగా మార్చి..

అనుమసముద్రంపేట: మతిస్థిమితం లేని వ్యక్తుల పట్ల మానవత్వం ప్రదర్శించాలి. కానీ ఓ వ్యక్తి వారిని కూలీలుగా మార్చాడు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన పలువురు మతిస్థిమితం లేని వ్యక్తులను వారి బంధువులు ఏఎస్‌పేట దర్గా వద్ద వదులుతుంటారు. కొందరిని స్థానికంగా ఉండే సంరక్షణ కేంద్రాల యజమానులకు అప్పగిస్తారు. దీని కోసం నెలకు కొంత నగదు కూడా చెల్లిస్తారు. దర్గా ప్రాంతంలో ఓ వ్యక్తి సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. అందులో మతిస్థిమితం లేని వ్యక్తులు ఉంటున్నారు. గ్రామంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో ఇల్లు కట్టేందుకు కాంట్రాక్ట్ పనులను సదరు వ్యక్తి ఒప్పుకొని తన వద్దనున్న మతిస్థిమితం లేని వ్యక్తుల చేత పనులు చేయిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆ వ్యక్తి వేరేచోట నిర్మాణాలకు వారిని పంపి కూలి డబ్బును తీసుకుంటున్నాడని ప్రచారం జరుగుతోంది. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పని చేస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తులు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.39

సన్నవి : రూ.28

పండ్లు : రూ.18



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 129	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 256
లేయర్ (లైవ్)	: 88		
బ్రాయిలర్ చికెన్	: 232	లేయర్ చికెన్	: 150



ఆర్చరీ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు విజయవాడ ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే 44వ ఎన్‌టీపీసీ ఆర్చరీ చాంపియన్‌షిప్ కోసం జిల్లా జట్ల ఎంపికలు ఆదివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగాయి. ఇండియన్ రౌండ్, రికర్వ్ రౌండ్, కాంపౌండ్ రౌండ్‌లకు సంబంధించి 28 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నిర్వాహకులు